క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న గ్రామస్తులు

నూతనకల్ : మాచనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ముత్యాలమ్మ తల్లి ఆలయానికి గ్రామానికి చెందిన కుందెన సుధాకర్, శేఖర్‌లు విరాళం అందజేశారు. ఆదివారం గ్రామంలో మాజీ సర్పంచ్ కుందెన భద్రాచలం జ్ఞాపకార్థం రూ. 25వేల నగదును ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బోయిన మహేష్, గౌడ సంఘం నాయకులు చామకూరి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు కుందెన రాజేష్, గుండాల మల్సూర్, బొల్క సైదులు, బ్రహ్మాండ్లపల్లి నాగార్జున చారి, యాకూబ్ చారి పాల్గొన్నారు.

ప్రకృతి వనం పరిరక్షణకు సిబ్బంది పాట్లు



అర్వపల్లిలో తాళం వేసి ఉన్న ప్రకృతి వనం

అర్వపల్లి : అర్వపల్లిలోని పల్లె ప్రకృతి వనాన్ని మందుబాబులు, ఆకతాయిలు తమ అడ్డాగా మార్చుకున్నారు. సాయంత్రమైతే అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నారు. దీంతో గ్రామ పంచాయతీ సిబ్బందికి పల్లెప్రకృతి వనాన్ని పరిరక్షించడం ఇబ్బందిగా మారింది. చేసేదేమీ లేక సిబ్బంది ప్రతిరోజు పల్లెప్రకృతి వనానికి తాళం వేస్తున్నారు. సాయంత్రం కాగానే తాళం వేసి ఉదయాన్నే తెరుస్తున్నారు. ఇలా చేయడంతో ఆకతాయిలు, మందుబాబులకు కొంత అడ్డుకట్ట పడింది.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు

అర్వపల్లి : రేఖ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాజిరెడ్డిగూడెం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను పంపిణీ చేస్తున్నట్లు ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు డాక్టర్ రేఖ బోయలపల్లి తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత కొన్నేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. మండలంలోని 32 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గ్రామాల వారీగా అన్ని పాఠశాలల్లో ఈ నెలాఖరు వరకు నోట్ పుస్తకాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పదవ తరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం చేయనున్నట్లు పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమైన ఇల్లు

నాగారం : షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన ఘటన నాగారం మండలంలోని ఈటూరు గ్రామంలో శనివారం రాత్రి జరిగింది. వివరాలు.. ఈటూరు గ్రామానికి చెందిన యాల యాదగిరి శనివారం కుటుంబ సభ్యులతో కలిసి ఆరుబయట నిద్రిస్తున్నాడు. రాత్రి 2గంటల సమయంలో అతడి ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. తెల్లవారుజామున పక్కింటి వ్యక్తులు గమనించి యాదగిరికి చెప్పడంతో వెంటనే ఆయన ఇంట్లోకి వెళ్లి చూడగా కూలర్, మంచం, బియ్యం, టీవీ, దుస్తులు, ఫ్రిజ్, బీరువాలో ఉన్న రెండున్నర తులాల బంగారం, 7తులాల వెండి, రూ.65వేల నగదు కాలిపోయాయి. రెవెన్యూ అధికారులకు సమాచారం ఇవ్వగా.. ఆర్ఐ లక్ష్మీనర్సింహరావు ఆదివారం ఘటనా స్థలాన్ని పరిశీలించి సుమారు రూ.4లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం తనకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నారు.

గంగమ్మ జాతర ప్రారంభం

నడిగూడెం : నడిగూడెం మండల కేంద్రంలో యాదవుల కులదైవం గంగమ్మ జాతరను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని శ్రీ సాయి మందిరంలో గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కేజీబీవీలకు అడ్మిషన్ల వెల్లువ

- అర్వపల్లిలోని కస్తూరిబా పాఠశాలల్లో చేరేందుకు విద్యార్థినుల ఆసక్తి
- గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి భారీగా చేరికలు
- ఒక్కో స్కూల్‌లో 200 సీట్లకు ఇప్పటికే పూర్తయిన అడ్మిషన్లు



అర్వపల్లిలోని నాగారం కస్తూరిబా పాఠశాల

అర్వపల్లి : కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాలకు ఈసారి అడ్మిషన్లు వెల్లువలా వస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అడ్మిషన్లు పెరిగాయి. ఖాళీలకు మించి అదనంగా వందల సంఖ్యలో అడ్మిషన్లు వస్తుండటంతో వీళ్లందరిని ఎలా చేర్చుకోవాలని అధికారులు అనేక పాట్లు పడుతున్నారు.

అర్వపల్లిలోని రెండు కేజీబీవీలలో..

జాజిరెడ్డిగూడెం మండలానికి సంబంధించిన కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని అర్వపల్లిలో ఏర్పాటు చేశారు. అలాగే నాగారం మండలానికి సంబంధించిన కేజీబీవీని కూడా తాత్కాలికంగా అర్వపల్లిలోనే ఏర్పాటు చేశారు. అయితే ఈ రెండు కేజీబీవీలలో ఒక్కో దానిలో 200 సీట్లు ఉన్నాయి. ఈ సంవత్సరానికి సంబంధించి అర్వపల్లిలో ఉన్న కేజీబీవీలో ఇప్పటికే మొత్తం అడ్మిషన్లు పూర్తయ్యాయి. ఇంకా రోజు పదుల సంఖ్యలో కొత్త అడ్మిషన్లు వస్తున్నాయి. దీంతోపాటు అర్వపల్లిలో నడుస్తున్న నాగారం కేజీబీవీలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ కేజీబీవీలో కూడా 200సీట్లకు ఇప్పటికే 228కి పైగా అడ్మిషన్లు అయ్యాయి. ఇంకా ప్రతిరోజు కొత్త అడ్మిషన్లు వస్తుండగా వారిని చేర్చుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. కేజీబీవీలలో నాణ్యమైన విద్య, ఆహారం, తదితర మౌలిక సదుపాయాలు కల్పిస్తుండడంతో విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. ఇక్కడి కేజీబీవీలలో 10వ తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత నమోదవుతుండడం కూడా విద్యార్థుల సంఖ్య పెరగడానికి ప్రధాన కారణంగా చెప్పవచ్చు. గతంతో పోలిస్తే ఈసారి సీట్లు నిండి అదనంగా అడ్మిషన్లు వస్తుండటంతో చేర్చుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది.

200 సీట్లు ఫుల్ అయ్యాయి



అర్వపల్లిలోని కస్తూరిబాగాంధీ విద్యాలయంలో 200సీట్లకుగాను మొత్తం ఫుల్ అయ్యాయి. అదనంగా ఇంకా అడ్మిషన్లు వస్తున్నాయి. కానీ కెపాసిటీకి మించి చేర్చుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది.

– నాగరాణి, ఎస్‌ఓ, అర్వపల్లి కేజీబీవీ

అదనంగా చేర్చుకున్నాం



అర్వపల్లిలో తాత్కాలికంగా నడుస్తున్న నాగారం కేజీబీవీలో ఇప్పటివరకు 228కి పైగానే అడ్మిషన్లు అయ్యాయి. అదనంగా 28 అడ్మిషన్లు చేర్చుకున్నాం. ఇంకా అడ్మిషన్లు వస్తూనే ఉన్నాయి. నాణ్యమైన విద్య, భోజనం, ఇతర వసతులు కల్పిస్తుండటంతో అడ్మిషన్లు పెరుగుతున్నాయి.

– శిరీన్, ఎస్‌ఓ నాగారం

కేజీబీవీలో కొత్తగా చేరాను



మాది పేద కుటుంబం. బయట చదువుకోలేని పరిస్థితి. అర్వపల్లి కేజీబీవీలో కొత్తగా చేరాను. ఇక్కడ నాణ్యమైన విద్యతో పాటు భోజన వసతి, అన్ని సౌకర్యాలు ఉన్నాయి. మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆశిస్తున్నా.

– అమూల్య, 7వ తరగతి

దగ్ధమైన ఇల్లు పరిశీలన.. బాధితులకు సాయం



ఈటూరులో దగ్ధమైన ఇంటిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

నాగారం : మండల పరిధిలోని ఈటూరు గ్రామంలో యాల యాదగిరికి చెందిన ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. ఈ విషయాన్ని తెలుసుకున్న తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదివారం గ్రామానికి చేరుకొని దగ్ధమైన ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బాధితుడికి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం యాల యాదగిరిని పరామర్శించి, రూ. 10,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చింతారెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, పానుగంటి నర్సింహారెడ్డి, వంగూరి కుమార్, గంగి అవిలయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం



తిరుమలగిరిలోని సుందరయ్య కాలనీలో ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య కాలనీకి ఎమ్మెల్యే మందుల సామేల్ రూ.1 కోటి నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం ఆ పార్టీ నాయకులు, కాలనీవాసులు ఎమ్మెల్యే చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు వై.నరేష్ మాట్లాడారు. గత 20 సంవత్సరాలుగా కాలనీకి రోడ్డు సౌకర్యం, మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వర్షాకాలం వచ్చిందంటే కాలనీకి వెళ్లాలంటే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణాల కోసం నిధులు మంజూరు చేయడం హర్షణీయమని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు పేరాల వీరేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్మిలాల్, పరమేష్, లక్ష్మి, పానుగంటి గణేష్, రాజు, శోభ, మల్లేష్ పాల్గొన్నారు.

పలువురికి ఆర్థికసాయం అందజేత



తిరుమలగిరి : బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు



అర్వపల్లి : కొమ్మాలలో ఆర్థికసాయం అందజేస్తున్న తోటి స్నేహితులు

తిరుమలగిరి : మండల పరిధిలోని వెలిశాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2005–06 సంవత్సరం పూర్వ విద్యార్థిని భానుమతి భర్త ఇటీవల విద్యుదాఘాతంతో మరణించారు. దీంతో భానుమతి కుటుంబానికి పాఠశాల పూర్వ విద్యార్థులు రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి శ్రీకాంత్, ఈదుల నరేష్, బత్తిని అనిత, ఆర్.నరేష్, శ్రీలత, ఏపూరి నరేష్ పాల్గొన్నారు.

అర్వపల్లి : కొమ్మాల గ్రామానికి చెందిన మాదం సుందర్‌రెడ్డి ఇటీవల మృతి చెందారు. దీంతో అర్వపల్లిలోని విజ్ఞాన్ పాఠశాలకు చెందిన 2006–07 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు రూ.16,500 విరాళాలు సేకరించి తమ తోటి స్నేహితుడు సుందర్‌రెడ్డి కుటుంబీకులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో బానోతు ఫిరోజీ, పృథ్వీరాజ్, తానేష్, సోమయ్య, అమీనుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

స్థూపం నిర్మాణ పనులకు శంకుస్థాపన



పనులను ప్రారంభిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు, రైతు కూలీ సంఘం వ్యవస్థాపక సభ్యుడు అలుగుబెల్లి వెంకట నరసయ్య స్మారక స్థూప నిర్మాణానికి ఆదివారం తుమ్మలపెన్‌పహాడ్‌లో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య మాట్లాడారు. పేదల కోసం, దోపిడీ లేని సమాజం కోసం పోరాడిన నాయకుల స్థూపాల నిర్మాణం అంటే నేటి పాలకుల ప్రజావ్యతిరేక పాలనకు వ్యతిరేకంగా ప్రజలను ఉద్యమాల వైపు తీసుకువెళ్లడమే అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు అలుగుబెల్లి వెంకటరెడ్డి, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేశోజు మధు, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల నర్సక్క, పార్టీ గ్రామ నాయకులు ప్రతాప్, మల్లయ్య పాల్గొన్నారు.

సామాజిక సేవలో ముందంజ

భానుపురి : సామాజిక సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్‌లు ఎల్లప్పుడూ ముందంజలో ఉంటాయని లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ శివప్రసాద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని క్లబ్ కార్యాలయంలో స్ఫూర్తి క్లబ్, స్పందన క్లబ్‌ల నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడారు. లయన్స్ కంటి ఆస్పత్రి ద్వారా వేలాది మంది పేదలకు కంటి చికిత్సలు, ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. అనంతరం స్ఫూర్తి క్లబ్ చైర్మన్‌గా వెన్న కవిత, స్పందన క్లబ్ ప్రెసిడెంట్‌గా సుధాకర్‌తోపాటు కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రావు, శ్రీనివాస్, తంగెళ్ల లక్ష్మీకాంతారెడ్డి, నాతి నవీందర్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనులను పూర్తి చేయాలి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో అసంపూర్తిగా నిలిచిపోయిన మరుగుదొడ్ల నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు బింగి కృష్ణమూర్తి అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడేళ్ల కిందట గ్రంథాలయంలో ఎస్‌డీఎఫ్ నిధులతో మరుగుదొడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారని చెప్పారు. అయితే ఇప్పటి వరకు పనులు పూర్తి కాలేదని తెలిపారు. అసంపూర్తి పనులను పూర్తిచేయాలని కోరారు.

నూతన కమిటీ ఎన్నిక

గరిడేపల్లి : మండల పరిధిలోని పొనుగోడు గ్రామంలో ఆదివారం అంబేద్కర్ యూత్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో యూత్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నందిపాటి నరేష్, ఉపాధ్యక్షుడిగా చిటికెల కిరణ్, కోశాధికారిగా లంకపల్లి రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఒగ్గు మహేష్, సభ్యులుగా ఇరుగు అనిల్, కుదురు మహేష్, చిలక మధు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు నరేష్ మాట్లాడారు. తన ఎన్నికకు సహకరించిన అంబేద్కర్ యూత్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నందిపాటి మల్లయ్య, నందిపాటి సామ్రాట్, కళ్యాణ్, కుర్రి వెంకన్న, అప్పికట్ల అశోక్, గోపి, చిలక పిచ్చయ్య, చిలక జానయ్య, వెంకటయ్య, జానకిరాములు, ప్రభు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

నాగారం : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అలుపెరగని పోరాటం చేసిన మునుగోడు ఎమ్మెల్యే కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని మాజీ పీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎర్ర యాదగిరి అన్నారు. ఆదివారం నాగారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు మంత్రి పదవి ఇవ్వాలని కోరారు. కోమటి రెడ్డి రాజగోపాల్‌రెడ్డి భువనగిరి లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి గెలుపు కోసం తీవ్రంగా శ్రమించారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతు ప్రయోజనాల దృష్ట్యా ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించడం హర్షణీయమన్నారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు ఉన్నారు.

శ్యామాప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళి



శ్యామాప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

భానుపురి : భారతీయ జన సంఘ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్యామాప్రసాద్ ముఖర్జీని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. ఆదివారం శ్యామాప్రసాద్ ముఖర్జీ వర్ధంతి సందర్భంగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంకినేని మాట్లాడారు. స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనడంతోపాటు దేశ అభివృద్ధికి శ్యామాప్రసాద్ ముఖర్జీ ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సలిగంటి వీరేంద్ర, ఎండీ. అబీద్, చలమల్ల నర్సింహ, శ్రీనివాస్, రమేష్, శశిధర్‌రెడ్డి, పరిపూర్ణచారి, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

వితంతువులపై వివక్ష విడనాడాలి



రెడ్డిగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న సంస్థ సభ్యులు

మద్దిరాల : వితంతువులపై వివక్ష విడనాడాలని సీఎస్‌ఏ సాంఘిక సేవా సంస్థ కోఆర్డినేటర్లు రమ, శిరీష అన్నారు. ఆదివారం అంతర్జాతీయ వితంతు మహిళా దినోత్సవం సందర్భంగా మండల పరిధిలోని రెడ్డిగూడెం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సమాజంలో భర్త చనిపోయిన స్త్రీలు పసుపు, కుంకుమ బొట్టు, గాజులు ధరించకూడదనే మూఢనమ్మకాన్ని విడనాడాలని అన్నారు. భర్తతో వచ్చేది పుస్తె, మెట్టెలు మాత్రమే కాని బొట్టు, గాజులు కావని తెలిపారు. వితంతువులకు చేతనైతే సహాయం చేయాలి తప్ప.. శుభ కార్యాలకు పనికిరారు అనే వివక్షను చూపొద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఎస్‌ఏ సాంఘిక సేవా సంస్థ సభ్యులు నాగెల్లి నిర్మల, ఎడ్ల ఉమ, వాస మరియమ్మ, ఈర్లాల నిరోష, పూలమ్మ, భూపతి మౌనిక, మంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతు రుణమాఫీ సాహసోపేత నిర్ణయం

అర్వపల్లి : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయనున్న రైతు రుణమాఫీ కార్యక్రమం సాహసోపేత నిర్ణయమని యువజన కాంగ్రెస్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నిద్ర సంపత్‌నాయుడు అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడారు. రుణమాఫీతో అనేక మంది పేద రైతులు కష్టాల నుంచి బయట పడతారని తెలిపారు. గత ప్రభుత్వం పదేళ్ల కాలంలో రుణమాఫీని ఆరేడు విడతల్లో చేసిందని గుర్తుచేశారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి ఒకేసారి రూ.2లక్షల రుణమాఫీ చేయబోతున్నారని తెలిపారు. ఏకకాలంలో రుణమాఫీ కాంగ్రెస్‌కే సాధ్యమని పేర్కొన్నారు.

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం 2018 కంటే ముందు రైతులు తీసుకున్న పంట రుణాలను మాఫీ చేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2018 డిసెంబర్ 12 తర్వాత తీసుకున్న పంట రుణాలు మాత్రమే మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమన్నారు. 2018 కంటే ముందు తీసుకున్న రుణాలను కూడా మాఫీ చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. తేదీలతో సంబంధం లేకుండా రైతు రుణాలన్నీ మాఫీ చేయాలని అన్నారు. ఆయనతో పాటు బీజేపీ నాయకులు గాజుల మహేందర్, ఉప్పుల లింగయ్య, పూసపల్లి శ్రీనివాస్, కత్తుల నరేష్, నాగరాజు, సాయికృష్ణ, బొంకురి నవీన్, చింతకుంట్ల వెంకన్న తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పెన్‌పహాడ్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



ఆత్మకూర్ (ఎస్) : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు

ఆత్మకూర్(ఎస్) : మండల పరిధిలోని పాత సూర్యాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2008–09 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి ప్రధానోపాధ్యాయుడు శంకరాచారి, ఉపాధ్యాయులు వీరారెడ్డి, జానకిరెడ్డి, సలీం, జగన్, నాగలక్ష్మి, శైలజ, ఎంవీఎఫ్ ఆర్గనైజర్ సామ నర్సిరెడ్డిలను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఆటపాటలతో ఆనందంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కొంగల శివ క్రిష్ణ, ఏర్పుల మహేష్, రేపాకుల సతీష్, కుంచం దయాకర్, మమత, గిరిజ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2006–2007 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. తమ యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ సాయంత్రం వరకు ఆనందంగా గడిపారు. అనంతరం ఆనాడు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నకిరేకంటి రవి, ఉపాధ్యాయులు శ్రవణ్‌కుమార్, దామెర శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 2004–2005 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మండల కేంద్రంలోని ఐఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



నూతనకల్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

మోస్తరు వర్షం.. లోతట్టు ప్రాంతాలు జలమయం



అర్వపల్లిలో హైవేపై నిలిచిన నీరు

అర్వపల్లి : అర్వపల్లితోపాటు మండల వ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు మోస్తరు వర్షం కురిసింది. ఈ చిన్నపాటి వర్షానికే అర్వపల్లిలో సూర్యాపేట–జనగామ 365బీ హైవే పలు ప్రాంతాల్లో చెరువును తలపించేలా మారింది. హైవేపై ఎక్కడికక్కడ నీరు నిలిచి రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. సంత, దేవాలయం ఆవరణలు బురమయంగా మారాయి. అలాగే జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో కూడా నీళ్లు నిలిచాయి.



బురదమయంగా మారిన సంతకు వెళ్లేదారి



అర్వపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ఆవరణలో చేరిన నీరు

ఆదర్శంగా తీసుకోవాలి

కోదాడరూరల్ : క్రీడాకారులు మేకల అభినవ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని టీపీసీసీ సభ్యుడు చింతకుట్ల లక్ష్మీనారాయణరెడ్డి అన్నారు. ఆదివారం చెస్ క్రీడాకారుడు మేకల అభినవ్ జయంతి సందర్భంగా పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చెస్ క్రీడలో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న అభినవ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం భారత క్రీడారంగానికి తీరనిలోటని అన్నారు. ఈ కార్యక్రమంలో అభినవ్ తల్లిదండ్రులు మేకల వెంకటేశ్వర్లు, అరుణ, మున్సిపల్ వైస్‌చైర్మన్ కందుల కోటేశ్వరరావు, వంగవీటి రామారావు, పార సీతయ్య, చందర్‌రావు, గంధం యాదగిరి, బొలిశెట్టి కృష్ణయ్య, ముత్తినేని సైదేశ్వరరావు, సామినేని రమేష్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.


విరాళం అందజేత

నడిగూడెం : నడిగూడెం మండల కేంద్రంలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో కల్యాణ మండప నిర్మాణానికి గ్రామానికి చెంది కన్నెబోయిన వెంకటేశ్వర్లు ఆదివారం రూ.10వేల విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భౌరిశెట్టి వెంకటరత్నం, కొండా వెంకన్న, వందనపు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ల లీకేజీ.. వృథా అవుతున్న నీళ్లు



కొత్తగూడెంలో వృథాగా పోతున్న నీరు



అన్నారంలో..

తుంగతుర్తి : కొత్తగూడెం, అన్నారం గ్రామాల్లో పైప్‌లైన్ లీకేజీల ద్వారా మిషన్ భగీరథ నీరు వృథా అవుతోంది. గత కొంత కాలంగా నీరు వృథాగా పోతున్నా గ్రామ పంచాయతీ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు అంటున్నారు. అసలే వర్షాకాలం కావడంతోపాటు పైప్‌లైన్ నీరు వృథాగా పోతుండటంతో వీధులు బురదమడుగులను తలపిస్తున్నారు. బురద కారణంగా దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. వీధుల్లో నిల్వ ఉన్న నీరు కొంతమంది ఇళ్లలోకి చేరుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీలను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆలయ ప్రథమ వార్షికోత్సవం

గరిడేపల్లి : కల్వపల్లి గ్రామంలో శ్రీ శీతల పరమేశ్వరి, శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ విఘ్నేశ్వరపూజ, స్వామి వారికి పంచామృత అభిషేకం చేశారు. అనంతరం 1008 జలబిందెలతో బొడ్రాయికి ఘటాభిషేకం, విశేష అర్చన అలంకరణ నిర్వహించారు. వేడుకల్లో భాగంగా మహిళలు జలబిందెలతో వచ్చి బొడ్రాయికి నీళ్లు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, యువకులు, పురోహితులు ద్రోణ సుబ్రహ్మణ్యేశ్వరశర్మ, రాయప్రోలు శ్రీరామయ్య శర్మ, దేవ మంగళశర్మ, దివాకర్‌శర్మ, యోగేంద్రచార్యులు పాల్గొన్నారు.